మంత్రి దామోదరకు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడిదల మండల నాయకులు

నల్లవల్లి అడవిలో డంపింగ్ యార్డు వద్దు

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేత

గుమ్మడిదల, సెప్టెంబర్ 22: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయొద్దని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి పలు పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో గుమ్మడిదల మండలానికి చెందిన పలు పార్టీల నాయకులు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సంహను కలిశారు. ఈ సందర్భంగా నల్లవల్లి పంచాయతీ పరిధిలోని అటవీప్రాంతంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించాలని వేడుకున్నారు. గుమ్మడిదల మండల ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రాంతం దుర్గంధంగా మారుతుందని మంత్రికి తెలిపారు. ఇప్పటికే వాయుసేనా అకాడమీ, డీఆర్‌డీఏ పరిధిలో పది వేల ఎకరాల చొప్పున 20 వేల ఎకరాలు పోయిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు ఇక్కడి ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు కాకుండా ముఖ్యమంత్రికి వివరిస్తానని తెలిపినట్లు వారు చెప్పారు. మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శంకర్, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, శంకర్, నల్తూరు యాదగిరి ఉన్నారు.

ఫార్మాసిటీ నుంచి భూములను రక్షించాలి

ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

నారాయణఖేడ్, సెప్టెంబర్ 22: ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం తమ భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నదని, తమ భూములను రక్షించాలని కోరుతూ న్యాల్కల్ మండలం డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. తరతరాలుగా వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న తాము మూడు పంటలు పండించే భూములు కోల్పోవడంతోపాటు ఫార్మాసిటీ ఏర్పాటుతో గాలి, నీరు, నేల కలుషితమయ్యే ప్రమాదం ఉన్నదని వాపోయారు. ఈ మూడు గ్రామాల్లో పట్టా, అసైన్డ్ భూములు 1,383 ఎకరాల భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఫార్మాసిటీ ప్రతిపాదిత ప్రాంతాల గుండా 136 బావులు, 70 బోరుబావులు ఉన్నాయని, ఫార్మాసిటీతో మంజీరా పరివాహక ప్రాంతం కలుషితమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తాను ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి మూడు గ్రామాలను ఫార్మాసిటీ నుంచి మినహాయించేలా కృషి చేస్తానని భరోసానిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండల రైతులు నారాయణఖేడ్ ఎమ్మెల్యేతో మొర పెట్టుకోవడం విశేషం.

పాత వార్డులనే కొనసాగించాలి

వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

మునిపల్లి, సెప్టెంబర్ 22: మండల కేంద్రమైన మునిపల్లిలో వార్డులను యథావిధిగా కొనసాగించాలని మునిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు మునిపల్లి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన మునిపల్లిలోని 10, 11, 12 వార్డులు ఏస్సీలకు కేటాయించినవి ఉన్నాయి. గ్రామంలో కొంత మంది నాయకులు వారికి అనుకులంగా ఉండేందుకు వార్డుల్లో మార్పులు చేసినట్లు సమాచారం ఉన్నదన్నారు. తొమ్మిది నెలలుగా ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని, ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండా

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మిర్కన్‌పేట్‌లో బాధితురాలికి పార్టీ బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భుపాల్‌రెడ్డి

కల్హేర్, సెప్టెంబర్ 22: బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీ విజయానికి సైనికుడిలా శ్రమించిన కార్యకర్త ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రూ.2 లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భుపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మిర్కన్‌పేట్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కూలి శేఖర్ ప్రమాదవశాత్తు మృతి చెందగా అతడి భార్య పద్మకు రూ.2 లక్షల విలువైన పార్టీ జీవిత బీమా చెక్కును అందజేశారు. అనంతరం వివిధ కారణాలతో రాపార్తి గ్రామానికి చెందిన చాకలి లింగమయ్య, సంగమ్మ, దూదేకుల చాంద్‌పాషా, అలికాన్‌పల్లి గ్రామానికి చెందిన జీవన్ చెరువులో పడి మృతి చెందగా బాధిత కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని బీఆర్ఎస్ ఆదుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు అలీ, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, బాచెపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు శ్రవణ్‌కుమార్, అంజయ్య, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ, నాగ్‌నాథ్, విఠల్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 22: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ, అత్యుత్తమ వయోవృద్ధులు పేద సీనియర్ సిటిజన్లకు, విశిష్ట సేవలందించడంలో నిమగ్నమైన, అర్హులైన సంస్థలకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందజేసేందుకు అర్హులైన వృద్ధులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి శనివారం ప్రకటనలో కోరారు. పూర్తి వివరాల కోసం www.wdsc.telangana.gov.in లో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుకు సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి ఈ నెల 25లోగా హైదరాబాద్‌లోని నల్గొండ ఎక్స్‌రోడ్డులోని దివ్యాంగుల సంక్షేమ భవన్‌లో సమర్పించాలన్నారు. వివరాలకు 9652394751, 040–245590480ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

సంగారెడ్డి, సెప్టెంబర్ 22: 2011 లెక్కల ప్రకారం 2.21శాతం మంది దివ్యాంగులు ఉన్నారని, సామాజిక గణాంకాల విభాగం విడుదల చేసిన నివేదిక ప్రకారం 19 శాతం మందికి చూపు, వినికిడి లోపం ఉన్నవారు ఉన్నారని, వారందరికీ పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్‌చేశారు. ఆదివారం పట్టణంలోని కేవల్ కిషన్ బవన్‌లో జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ అధ్యక్షతన దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 76 శాతం మంది దివ్యాంగులు గ్రామీణ ప్రాంతంలో, 24 శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 43.02లక్షల మంది దివ్యాంగులుంటే 5.75లక్షల మందికే పెన్షన్ వస్తున్నదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాక్ పోస్టులనుభర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. నిరుద్యోగ దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. దివ్యాంగులపై జరుగుతున్న వేధింపులు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని కోరారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా 3వ మహాసభలు పట్టణంలో ఈ నెల 28న నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సదరం స్లాట్ బుకింగ్‌లో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ప్రతినిధులు హాజరు అవుతున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జయలక్ష్మి, నర్సింలు, రాంచందర్, అశ్వక్, ప్రకాశ్‌రావు, నాయకులు రాజకుమార్, శివరాజ్, మచ్చేందర్, శ్రీనివాస్‌చారి, శంకర్ నాయక్, షాదుల్లా, కృష్ణ, కృపవరం, మహేశ్వరీ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలతో ఆదాయానికి గండి!

పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో అక్రమంగా చేపడుతున్న షెడ్ల నిర్మాణాలు

బొల్లారం, సెప్టెంబర్ 22: అనుమతులు లేకుండా యథేచ్ఛగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని బొల్లారం పారిశ్రామిక వాడ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని సర్వే నంబర్ 81, 84లో ఓ పరిశ్రమ యాజమాన్యం నెల రోజులుగా అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నదని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారిలో భారీ స్థాయిలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నా అటువైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ జరుగుతున్న కార్యకలాపాలపై తక్షణమే అధికారులు స్పందించి తగు విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

ఝరాసంగం, సెప్టెంబర్ 22: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న పటన్‌చెరువు నియోజకవర్గంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే బహిరంగ సభకు ఝరాసంగం మండల పరిధిలోని రేషన్ డీలర్లు బాధ్యతగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు అనిల్ పటేల్, ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ ఆదివారం ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీ ప్రకారం కనీస గౌరవ వేతనం రూ.5 వేలు, క్వింటాలుకు రూ.300 కమిషన్ సాధించే దిశగా డీలర్లు అడుగులు వేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

రామచంద్రాపురం, సెప్టెంబర్ 22: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం ఆర్సీపురం డివిజన్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో తోషిబా కార్మికుల అభినందన సభ జరిగింది. ఈ సభకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంట్రాక్ట్, క్యాజువల్, టెంపరరీ కార్మికుల పేరుతో విపరీతమైన దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతునే ఉంటుందని తెలిపారు. తోషిబా పరిశ్రమలో జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూ ఘనవిజయం సాధించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లికార్జున్, భూపాల్‌రెడ్డి, మల్లేశ్, పాండురంగారెడ్డి, అనంతరావు, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, లోకేశ్, శ్రీధర్, వెంకటేశ్వరరావు, రాజిరెడ్డి, బాగారెడ్డి, శాంతకుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభను జయప్రదం చేయండి

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 22: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి యూనియన్ ఉద్యమ కాలాన్ని 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అర్ధ శతాబ్ది సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మహనీయుల విగ్రహాల వద్ద గోడ పత్రికను ఆవిష్కరించారు. అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం, సమసమాజ నిర్మాణం, నూతన ప్రజాస్వామిక విప్లవం వంటి ఉన్నతమైన ఆశయాలతో ఏర్పడిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, డివిజన్ నాయకులు బన్నీ, సాత్విక, సిద్దేశ్వర్, శ్రీనిధి, మల్లేశ్వరీ, శివ, సాయి, సురేశ్ శ్రీకాంత్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

జహీరాబాద్, సెప్టెంబర్ 22: పిడుగుపాటుకు మహిళ మృతి చెందిన ఘటన నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం న్యామతాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. న్యామతాబాద్ గ్రామానికి చెందిన బూచినెల్లి నాగమ్మ శనివారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఉరుములు, మెరుపులతో గాలి వాన రావడంతోపాటు పక్కనే పిడుగు పడింది. దీంతో అమె స్పృహతప్పి కింద పడిపోయింది. గమనించిన ఆటో డ్రైవర్ నాగమ్మ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే చికిత్స నిమిత్తం బీదర్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. ఆదివారం మృతిరాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు తెలిపారు. ఆమెకు భర్తతోపాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిడుగుపాటుకు మృతి చెందిన బూచినెల్లి నాగమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు

దాదిగూడ నూతన మత్స్య సంఘం ఏర్పాటు

జిన్నారం, సెప్టెంబర్ 22: ఊట్ల గ్రామ పంచాయతీ దాదిగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటైంది. సంఘానికి సంబంధించి మంజూరైన ఉత్తర్వులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంఘం సభ్యులకు అందజేశారు. గ్రామంలోని అంతయ్యకుంట, మాదన్నకుంట, చింతలకుంట, రెడ్డికుంట, కాపుమల్లన్నకుంటతో కలిపి సంఘం ఏర్పాటైనట్లు సభ్యులు తెలిపారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధును కలిశారు. ఎస్.మహేశ్, మాణిక్యరావు, సత్యనారాయణ, దేవేందర్, వెంకటేశ్, రమేశ్, భిక్షపతి, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత వజీర్ బేగ్‌కు నివాళి

సంగారెడ్డి, సెప్టెంబర్ 22: సీపీఐ సీనియర్ నాయకుడు వజీర్ బేగ్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. పట్టణంలోని మార్క్సనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన సీపీఐ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ వజీర్‌బేగ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్, నాయకులు మహబూబ్, రెహమాన్, నరేందర్ ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 22: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల నుంచి వరంగల్‌లో ప్రారంభకానున్న అండర్–19 అంతర జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 నుంచి 2008 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల క్రికెట్ క్రీడాకారులు తమ ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

శివాలయానికి విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్

జ్యోతిర్లింగ ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం, సెప్టెంబర్ 22: మండల కేంద్రం జిన్నారంలో నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ ఆలయానికి మాదారం గ్రామ మాజీ సర్పంచ్ సరితాసురేందర్‌గౌడ్ రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం తన నివాసంలో రూ.లక్ష విరాళం, మరో లక్ష విలువైన నిర్మాణ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మంద రమేశ్, గణేశ్, మహేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌గుప్తా, అనీల్‌రెడ్డి, ఫణిభూషన్, శ్రీకాంత్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 22: ఉద్యోగోన్నతి పొందిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులను సామాజికవేత్త మామిడి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ అమూల్యమ్మ, టీజీపీఈటీఏ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యధర్శి రామకృష్ణ, కలావతి, కోశాధికారి సుభాష్‌గౌడ్, రాజు గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 22: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎస్ భరోసా అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, మున్సిపాలిటీల్లోని 118 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.43 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు శస్త్ర చికిత్సలు ఉన్నాయని తెలిస్తే తక్షణం స్పందించి సీఎం రిలీఫ్‌ఫండ్స్ ద్వారా ఆర్థికంగా అండగా ఉంటున్నామన్నారు. ప్రజల ఆరోగ్యాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు నగేశ్‌యాదవ్, నరసింహారెడ్డి, వెంకటేశ్, రాము, రాజు, సంజీవరెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దిగ్వాల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కోహీర్, సెప్టెంబర్ 22: మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలో ఆదివారం 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. అప్పటి విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో మండల నోడల్ ఆఫీసర్ జాకీర్‌హుస్సేన్, సత్యనారాయణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో చిన్నారుల ప్రతిభ

చిన్నారులతో ట్రైనర్, కోచ్‌లు

నారాయణఖేడ్, సెప్టెంబర్ 22: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో బెల్ట్ పోటీల్లో నారాయణఖేడ్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు ప్రతిభ కనబర్చి బ్లాక్ బెల్లు సాధించినట్లు మాస్టర్ ట్రైనర్ లింగంపల్లి రాములు తెలిపారు. పట్టణానికి చెందిన విద్యార్థులు ఆకర్ష్‌రెడ్డి, అనిరుధ్‌కుమార్, గణేష్‌కుమా పోటీల్లో పాల్గొని బ్లాక్‌బెల్లు దక్కిందన్నారు. ఆత్మరక్షణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ తైక్వాండో నేర్చుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్‌తోపాటు కోచ్‌లు శ్రీనివాస్, రాములు చిన్నారులను అభినందించారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి

మునిపల్లి, సెప్టెంబర్ 22: మండల పరిధిలోని మేళసంగం శివారులోని గోల్డెన్ గ్రీన్ వెంచార్‌లో విద్యుత్ షాక్‌తో ఆవు మృతి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకోల్–తాటిపల్లి ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వెంచర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో శనివారం మేళసంగం గ్రామానికి చెందిన ఓ రైతు ఆవు మేసుకుంటూ వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందింది. వెంచర్ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఆవు మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. ఆవు మృతితో నష్టపోయిన యజమానికి వెంచర్ నిర్వాహకులు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించినట్లు సమాచారం.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్, సెప్టెంబర్ 22: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలోని తాట్‌పల్లి గ్రామానికి చెందిన మేతరి నర్సయ్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, సుభాష్‌పాటిల్, శివకుమార్ పాటిల్, జైపాల్, నాగేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ రుణాలు మంజూరు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 22: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన దళిత హక్కుల పోరాట సమితి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీల అభ్యున్నతికి బడ్జెట్ కేటాయించాలని, దేశ వ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, రాము, సతీశ్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

కుడికుంటను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

బొల్లారం, సెప్టెంబర్ 22: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో జోరుగా సాగుతున్నాయి. ఆదివారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు స్థానిక కుడికుంటలో వినాయక నిమజ్జనం అనంతరం పేరుకుపోయిన ఘన వ్యర్థాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ సూచనమేరకు పారిశుధ్య సిబ్బంది తొలిగించి శుభ్రం చేశారు. అనంతరం ఉషాలక్ష్మీ విల్లాస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. స్వచ్ఛతే ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుందన్నారు.

ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఎస్సైకి సన్మానం

ఎస్ఐ యాదుల్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

రాయికోడ్, సెప్టెంబర్ 22: మండల పరిధిలోని మొరటుగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించి ఎస్ఐ ఉద్యోగం సాధించిన ఎండీ యాదుల్ ఇటీవల ట్రైనింగ్ పూర్తి చేసుకొని గ్రామానికి వచ్చారు. దీంతో కర్చల్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల, శాలువాతో సన్మానించారు. మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు. తన మిత్రుడు ఎస్సైగా ఉద్యోగం సాధించడం గర్వంగా ఉన్నదన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నిక

చేర్యాల, సెప్టెంబర్ 22 : చేర్యాల రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం పట్టణంలోని శుభోదయ స్కూల్‌లో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా మిట్టపల్లి నారాయణరెడ్డి, అధ్యక్షుడిగా బొల్లు ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మిట్టపల్లి నర్సిరెడ్డి, మంద లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఒల్లాద్రి రాజిరెడ్డి, కోశాధికారిగా బర్రె శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.